క్లుప్తంగా

పేద ముస్లిం యువతి వైద్యానికి ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న డాక్టర్ షాకీర్

ఒంగోలు: పేద ముస్లిం యువతి వైద్య ఖర్చులకు స్థానిక బిలాల్‌నగర్‌లోని ఇక్రా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. సత్యన్నారాయణపురానికి చెందిన షేక్ మస్తాన్‌బీ అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం యువతి తండ్రికి ట్రస్టు వ్యవస్థాపకుడు షాకీర్ చెక్కు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఫిరోజ్, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ డాక్టర్ సమీరా, సాధిక్ పాల్గొన్నారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తపట్నం: బెల్ట్ షాపులపై స్థానిక పోలీసులు సోమవారం దాడులు చేసి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన ఊడా రాధయ్య తన నివాసానికి దూరంగా మందు బాటిళ్లు విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సాంబశివరావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రకాశం భవనం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు.

రెండు బైకులు ఢీ, ఇద్దరికి గాయాలు

అద్దంకి రూరల్: రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. ముండ్లమూరు మండలం కెల్లంపల్లి గ్రామానికి చెందిన దాసరి యేసయ్య బైక్‌పై దర్శివైపు వెళ్తున్నాడు. చెరువుకొమ్ముపాలేనికి చెందిన బాలిశెట్టి సుబ్బారావు అద్దంకి వైపు బైక్ మీద వస్తున్నాడు. సరిగా తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోని ఇటుకబట్టీల వద్ద రాగానే ఎదరెదురుగా ఢీకొన్నారు. ఈఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సమ్మె



గిట్టుబాటు ధరపై చర్చిస్తున్న గ్రానైట్‌ఫ్యాక్టరీ యజమానులు

చీమకుర్తి: రామతీర్థం, బూదవాడ పరిధిలోని 3 సెంటీమీటర్ల స్లాబులకు సంబంధించిన గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు సోమవారం నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. గ్రానైట్ స్లాబులకు బయ్యర్ల నుంచి గిట్టుబాటు ధర రాకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం నుంచి ఫ్యాక్టరీలలో పనులను నిలిపివేసి సమ్మెలో పాల్గొనాలని ఫ్యాక్టరీ యజమానులు ఎం.రామారావు, విజయ్, రాజశేఖరరెడ్డి, ఎస్‌దాని, స్థానికులు తెలిపారు.

అనారోగ్య బాధితుడికి ఆపన్నహస్తం

- రూ.10 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు:

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి రూ.10 లక్షల చెక్కు మంజూరు చేయించి ఆపన్నహస్తం అందించారు. ఒంగోలుకు చెందిన గుంటక సుబ్బారెడ్డి కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక ఇటీవల ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిశారు. వెంటనే స్పందించిన బాలినేని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఆ మేరకు విడుదలైన లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాన్ని సుబ్బారెడ్డికి బాలినేని అందించారు. పేదలకు ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఆయన అన్నారు. సుబ్బారెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితంలోకి తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు బాలినేని తెలిపారు.

కరవది సొసైటీలో అక్రమాలు అవాస్తవం

- నిజాయితీగానే కొనుగోళ్లు
- సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది సొసైటీలో అక్రమంగా కొనుగోళ్లు జరిగాయని ఈ నెల 21వ తేదీ ఒక దినపత్రికలో ప్రచురించిన కథనాన్ని సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి ఖండించారు. సొసైటీ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కరవది రైతు భరోసా కేంద్రం సిబ్బంది చేసిన పొరపాటు వలన సొసైటీ పరిధిలోని 16 గ్రామాల్లో శనగ రైతులకు సంబంధించి ఇ-క్రాప్ నమోదులో తప్పిదం జరిగిందన్నారు. కరవది గ్రామ వ్యవసాయ సహాయకుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని అర్హులైన రైతులు కేంద్రాల్లో శనగలు అమ్ముకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. అంతేగానీ, సొసైటీలో అక్రమాలు జరగలేదని స్పష్టం చేశారు.



సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి

వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది తప్పిదాన్ని సొసైటీ తప్పిదంగా భావించడం సరికాదన్నారు. ఆర్‌బీకే సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేషన్ ఆస్తులు కాపాడాలి

- అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి

ఒంగోలు సబర్బన్: నగరపాలక సంస్థకు చెందిన ఆస్తులను కాపాడాలని ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని వివిధ విభాగాలను సోమవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలతో కూడా సమీక్షించారు. మున్సిపల్ ఆస్తులు కాపాడటంతో పాటు నగరంలో వెల్‌కం ఆర్చ్‌లు, జంక్షన్ డెవలప్‌మెంట్‌లను డిజైన్ చేయాలని ఆదేశించారు.



ఇంజనీరింగ్ విభాగాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ

జగనన్న ఆణిముత్యం విద్యార్థినికి సన్మానం

గిద్దలూరు రూరల్: కొమరోలు మండలానికి చెందిన విద్యార్థిని కె.హర్షిత పదో తరగతిలో 573 మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికైన సందర్భంగా సోమవారం విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు కోటిలింగాచారి ఆధ్వర్యంలో స్థానిక కాళికాదేవి ఆలయంలో సన్మానించారు. విశ్వబ్రాహ్మణులంతా కలిసి రూ.3,500ను విద్యార్థినికి బహుమతిగా అందజేశారు.

షమీమాను అభినందించిన తహసీల్దార్

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని షేక్ షమీమా ఇంటర్ సీఈసీలో 938 మార్కులతో జిల్లా మొదటి ర్యాంక్ సాధించి జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు షమీమాను సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరం అధిరోహించి తల్లిదండ్రులకు, సమాజానికి, కళాశాల అధ్యాపకులకు మంచి పేరు తెచ్చి పెట్టాలని తహసీల్దార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు, ఐజక్, రవి, షమీమా తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షునిగా ఎలేన్



ఎలేన్

నాగులుప్పలపాడు: ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా రాయపూడి ఎలేన్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ తెలిపారు. ఆదివారం రాత్రి ఒంగోలులో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్షునిగా ఎలేన్‌తో పాటు మరో 9 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్ల మద్దిరాల గ్రామ సచివాలయంలో పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎలేన్‌ను జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేయడంతో ఆ సచివాలయ ఉద్యోగులు అతనికి అభినందనలు తెలిపారు.

ప్రతి ఇంటినీ పన్ను పరిధిలోకి తీసుకురావాలి

ఒంగోలు సబర్బన్: నగరంలోని ప్రతి ఇంటినీ పన్ను పరిధిలోకి తీసుకురావాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఆయన చాంబర్‌లో సోమవారం నగరపాలక సంస్థ రెవెన్యూ, పారిశుధ్య విభాగాలతో సమీక్షించారు. గత వారంలో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు నగరంలో ఇప్పటి వరకు ఇంటి పన్ను వేయని అసెస్‌మెంట్స్ అన్నింటినీ గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా నీటి పన్ను, కొళాయి పన్నుల వసూలు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని పన్నులకు సంబంధించి నెలవారీ టార్గెట్లు పెట్టుకుని వాటిని అందుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం శానిటేషన్ విభాగంపై కూడా కమిషనర్ సమీక్షించారు. నగరంలోని మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని కమిషనర్ తెలిపారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

సీఎం జగన్ పాలన మెచ్చి...

- రాష్ట్రవ్యాప్తంగా వాల్ పెయింటింగ్ వేస్తున్న అభిమాని

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో నాలుగేళ్లుగా ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని జగనన్న అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కావూరి జయకుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మెచ్చుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వాల్ పెయింటింగ్ వేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఒంగోలులో మా నమ్మకం నువ్వే జగనన్న అనే స్లోగన్‌తో పాటు సీఎం జగన్ చిత్రాన్ని తన పెయింటింగ్ ద్వారా అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పెయింటింగ్‌ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నదే తన ఉద్దేశమని ఆయన అన్నారు.



పెయింటింగ్ వేస్తున్న జయకుమార్

సర్కారు బడులకు భద్రత

- నైట్ వాచ్‌మెన్‌ల నియామకం
- ఆకతాయిలకు చెక్
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



పందిళ్లపల్లి హైస్కూలు

వేటపాలెం: నాలుగేళ్లలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేశారు. గత ప్రభుత్వం పాఠశాలలను నిర్వీర్యం చేసి పూర్తిగా కార్పొరేట్ సేవలో నిమగ్నమైంది. ఫలితంగా విద్యావ్యవస్థ గాడితప్పి పేద ప్రజల పిల్లలు అవస్థలు పడ్డారు. అయితే సీఎం జగన్ రాష్ట్రంలో ప్రత్యేకంగా విద్యారంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. అందుకు తగిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, వనరుల కల్పనకు కోట్లు ఖర్చు చేశారు. విద్యార్థుల కోసం వివిధ పరికరాలు, బెంచీలు, కుర్చీలు అంటి అనేకమైన పరికరాలు నూతనంగా కొనుగోలు చేసి అభివృద్ధి చేశారు. గతంలో పాఠశాలలో దొంగలు కంప్యూటర్లు, టీవీలు, కిటికీలు, బెంచీలు వంటివి దొంగతనాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని నేడు ప్రభుత్వం పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసేందుకు పూనుకుంది. నైట్ వాచ్‌మెన్‌ల ఏర్పాటు చేయడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో చాలసార్లు చోరీలు జరిగాయి. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మార్చేస్తున్నారు. మద్యం మత్తులో ఆస్తులను, ఫర్నీచర్లను ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. పాఠశాలలకు రక్షణ కరువైన నేపథ్యంలో ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌లను నియమిం చేందుకు చర్యలు చేపట్టింది.

స్థానికులకే ప్రాధాన్యం..

జిల్లా పరిషత్ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లను నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హెచ్‌ఎంలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ. 6 వేల గౌరవ వేతనం ఇస్తారు. నైట్ వాచ్‌మెన్ పోస్టులకు సంబంధించి ఆదే హైస్కూలో పని చేసే మహిళ భర్తకు ప్రాధాన్యత ఇవ్వనుంది. 60 ఏళ్ల లోపు వయసున్న ఎక్స్‌సర్వీస్ మెన్ గాని, పేరెంట్స్ కమిటీ ఎంపికచేసే వ్యక్తిని గాని నియమించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ షరతుల ప్రకారం ఎంఈవో, హెచ్‌ఎంల సమన్వయంతో నమ్మకంగా పనిచేసే వాచ్‌మెన్‌లను నియమించుకున్నారు.

మండలంలో ఐదు స్కూళ్లలో..

వేటపాలెం మండల పరిధిలో కొత్తగా నాలుగు ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లు ఏర్పాటు చేశారు. కొత్తపేట, దేశాయిపేట, పందిళ్లపల్లి, అక్కాయిపాలెం హైస్కూళ్లలో నియమించారు. వేటపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు గతంలోనే నైట్ వాచ్‌మెన్ ఉన్నారు. మండలం పరిధిలోని మొత్తం ఐదు హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లు ఉన్నారు.

> **పాఠశాలలకు రక్షణ..**
>
> ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం. గతంలో చాలా సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో పాఠశాలల ఆస్తులకు రక్షణ ఏర్పడింది. నాలుగు స్కూళ్లకు వాచ్‌మెన్‌లను నియమించాం.
>
> – ఎస్ నిరంజన్, ఎంఈవో, వేటపాలెం



వైభవంగా అంకమ్మతల్లి కొలుపులు



అమ్మవారి ఉత్సవ విగ్రహాలు, వల్లిఆవు



కార్యక్రమంలో ఒట్టిగొర్ల కుటుంబ సభ్యులు

బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో ఒట్టిగొర్ల వారి అంకమ్మతల్లి కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో ఉన్న ఒట్టిగొర్ల కుటుంబ సభ్యులంతా అమరావతి సముద్ర స్నానానికి గ్రామోత్సవంతో తరలివెళ్లారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలు, వల్లిఆవును తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత గ్రామోత్సవంతో తిరిగి గ్రామానికి చేరారు. సోమవారం మాతుడుకు, గజాల కొలుపు సంబరం చేపట్టారు. మంగళవారం పుట్ట బంగారం కొలుపు, బుధవారం దీపం అవసరం, తేనేఆట, గ్రామోత్సవం పాపావేషం, గురువారం గుడార సేవ, కొలుపుల ముగింపు రాత్రికి అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు స్పెల్లింగ్ బీ పోటీలు

చీరాల అర్బన్: గీతా యంగ్ సైంటిస్ట్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో స్పెల్లింగ్ బీ పోటీలు నిర్వహించారు. సైన్స్, మ్యాథ్స్, టెక్నాలజీ సబ్జెక్టులపై పోటీలను వలివేటి మురళీకృష్ణ నిర్వహించారు. 25 పాఠశాలల నుంచి 94 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6,7 తరగతుల వారిని జూనియర్లుగా, 8,9,10 తరగతుల వారిని సీనియర్ కేటగిరిగా విభజించి రాత పరీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగంలో పది మందిని ఫైనల్స్‌కు ఎన్నుకుని వారికి మౌఖికంగా పోటీ నిర్వహించారు. రెండు నిమిషాల సమయంలో ఎక్కువ పదాలకు స్పెల్లింగ్ చెప్పిన వారిని విజేతలుగా నిర్ణయించారు. చీరాల ప్రాంత విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి పోటీకి సిద్ధం చేయడమే తమ ముఖ్య ఉద్దేశమన్నారు. మొదటి బహుమతి రూ.1000, రెండో బహుమతి రూ.500, సర్టిఫికెట్లు, పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఐ.బాబూరావు, బాలవెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, చీరాల కృష్ణమూర్తి, శివాంజనేయప్రసాద్, భారత్, వెన్నెల, కిరణ్, లావణ్య, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న సభ్యులు

పశు బీమా పథకంతో పాడి రైతులకు ఊరట

గిద్దలూరు రూరల్: పశు బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులకు ఊరట లభిస్తోందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి డాక్టర్ బేబీరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకం స్థానంలో ఈ పథకాన్ని నూతనంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పథకంలో లబ్ధిదారుని వాటా ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు 20 శాతం కాగా, ఏపీఎల్ లబ్ధిదారులకు 50 శాతంగా నిర్ణయించడం జరిగిందన్నారు. గరిష్ఠంగా ఒక కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు పశు బీమా చేసుకోవచ్చని వివరించారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

బేస్తవారిపేట: బాకీ విషయమై రెండు కుటుంబాల మధ్య తలెత్తిన వివాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని కోనపల్లె గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కోనపల్లెకు చెందిన శివరాం, తిరుమలనాథం ఇద్దరు సమీప బంధువులు. ఆదివారం వీరిద్దరు కోనపల్లెలోని ఓ గృహంలో మద్యం సేవించారు. ఈ సందర్భంగా శివరాం తన తల్లి పీరాంబీకి ఇవ్వాల్సిన రూ.90 వేల డబ్బు ఎప్పుడిస్తావని తిరుమలనాథంను ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఘర్షణకు దిగారు. దీంతో శివరాంపై కక్ష పెంచుకున్న తిరుమలనాథం సోమవారం శింగరపల్లె నుంచి తన బంధువు మరొకరిని తీసుకుని శివరాం ఇంటికి వెళ్లాడు. శివరాంను కర్రతో కొట్టడంతో చెయ్యి విరిగింది. అడ్డు వచ్చిన భార్య లక్ష్మి, కూతురుకు స్వల్పగాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరావు తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

దర్శి టౌన్: పట్టణ శివారులో పేకాట స్థావరంపై సోమవారం ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



పొంగళ్లతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

పొదిలి రూరల్: మండలంలోని బుచ్చనపాలెం సమీపంలో కొలువై ఉన్న ముక్కుడు గంగమ్మతల్లి ఆలయ తిరునాళ్ల సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, క్షీరాభిషేకం చేశారు. కొత్తపల్లి, బుచ్చన్నపాలెం, కొస్టాలపల్లి గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు పొంగళ్లతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. రాత్రికి విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా ఎడ్ల బండలాగుడు పందేలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. పొదిలి బాప్టిస్టుపాలేనికి చెందిన వేల్పుల రేబేన్ ఎడ్లు ప్రథమ బహుమతి రూ.10 వేలు, అదే గ్రామానికి చెందిన గంజా రవి ఎడ్లు రెండో బహుమతి రూ.10 వేలు, గంజా విజయబాబు ఎడ్లు మూడో బహుమతి రూ.5 వేలు, చల్లావారిపాలేనికి చెందిన యరగొర్ల యలమంద ఎడ్లు నాలుగో బహుమతి రూ.3 వేలు, జువ్వలేరుకు చెందిన అలవల వెంకటేశ్వర్లు ఎడ్లు ఐదో బహుమతి రూ.2 వేలు గెలుపొందాయి.



మొదటి బహుమతి సాధించిన రూబెన్ ఎడ్లు